డ్రెయినేజీల నిర్మాణం ఎప్పుడో.?

- పెనమలూరులో రోడ్డుపైనే మురుగునీరు
- చినుకు పడితే మోకాటి లోతు నీరు

నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గ్రామంలో డ్రెయినేజీలు లేకపోవడంతో చినుకు పడితే చాలు గ్రామ ప్రధాన రహదారి, ఇళ్లు నీట మునిగిపోతున్నాయి. రోడ్డుపై మురుగునీరు నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పెనమలూరులో ప్రస్తుతం డ్రెయినేజీల పరిస్థితి

పెనమలూరు: నియోజకవర్గ కేంద్రం పెనమలూరులో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ముఖ్యంగా ప్రధాన రహదారి పక్కన డ్రెయినేజీ లేకపోవడంతో వర్షం చినుకు పడితే గ్రామంలో ఉన్న డ్రెయినేజీ మురుగునీరు నేరుగా వచ్చి ప్రధాన రహదారిపై నిలిచిపోతుంది. మురుగు నీరు పారుదల లేకపోవడంతో పక్కనే ఉన్న పేరంటాళ్ల చేరువులోకి ఆ మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతుంది. గ్రామంలో డ్రెయినేజీ సమస్య చాలా తీవ్రంగా ఉన్నా.. ఇప్పటి వరకు అటు అధికారులు కానీ, ఇటు పాలకులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

వ్యాధులు ప్రభలే ప్రమాదం

గ్రామంలో మురుగునీరు కారణంగా గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారు. అంతర్గత డ్రెయినేజీల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా ప్రధాన రహదాకి వద్దకు చేరుకుంటోంది. అయితే ప్రధాన రహదారికి పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు ఎక్కడపడితే అక్కడ నిలిచిపోతుంది. వర్షం పడితే మొకాటి లోతు నీరు ప్రధాన రహదారిపై ఉండిపోతుంది. హైస్కూల్ సెంటర్ నుంచి డ్రెయినేజీ నీరు పారుదలకు మార్గం లేక ఈ సమస్య తలెత్తుతోంది. దీంతో జెండా చెట్టు నుంచి చిన్న గుడి వరకు డ్రెయినేజీ నీరు ప్రధాన రహదారిపై నిలిచిపోతుంది. గత ఆగస్టులో కురిసిన భారీ వర్షాలకు ఈ ప్రాంతం మురుగునీటిలో మునిగిపోయింది. దాదాపు వారం రోజులపాటు గ్రామస్తులు మురుగునీటిలోనే ఉండిపోయారు. గ్రామ ప్రజలు నానా ఇబ్బందులు పడినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. డ్రెయినేజీల పరిస్థితి ఇలాగే ఉంటే గ్రామంలో వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉంది. ప్రజారోగ్యం పడకేస్తుంది. దోమలు, ఇతర కీటకాలు విజృంభిస్తున్నాయి. మురుగునీరు పారుదలకు అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రభుత్వ చర్యలు శూన్యం

పెనమలూరు గ్రామానికి మురుగునీటి సమస్య పరిష్కారం కావాలంటే గ్రామంలో పక్కా డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాలి. హైస్కూల్ సెంటర్ వద్ద నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏనుగుల కోడు వరకు డ్రెయిన్లు నిర్మించాలి. అలాగే చెరువు పక్క నుంచి ఉన్న కాలువను ఆధునికీకరించి మురుగునీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. అయితే ఈ ప్రాంత రైతులు అభ్యంతరం చెబుతున్నారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి. అయితే కూటమి ప్రభుత్వం డ్రెయినేజీల నిర్మాణంపై ఇప్పటివరకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేయలేదు. అభివృద్ధే ఊపిరని చెప్పుకుంటున్న పాలకులు పెనమలూరు డ్రెయినేజీల విషయంలో చర్యలు తీసుకోవడం లేదు. వచ్చే వర్షాకాలం నాటికైనా డ్రెయినేజీల నిర్మాణం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



వర్షం పడితే పెనమలూరు ప్రధాన రహదారి దుస్థితి (ఫైల్)

డ్రెయినేజీలు అత్యవసరం



గ్రామ ప్రజలు సురక్షితంగా ఉండాలంటే డ్రెయినేజీల నిర్మాణం అత్యవసరం. రోడ్డు పైనే మురుగునీరు నిలిచిపోతుంది. చెరువు కూడా కలుషితంగా మారింది. పూర్తిగా అనారోగ్య వాతావరణం ఉంది. అధికారులు వెంటనే స్పందించాలి.

–మరీదు గురుప్రసాద్, పెనమలూరు

క్లుప్తంగా

నేడు కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలోని హుండీలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ పి.ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖాధికారుల సమక్షంలో ఉదయం తొమ్మిది గంటలకు కానుకలను లెక్కిస్తారని పేర్కొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శుక్ర, శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరగనుందని సంఘ అధ్యక్షుడు పి.రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1999 ఇంజినీరింగ్ బ్యాచ్ రెండు రోజుల పాటు సమ్మేళనం నిర్వహించి భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరుగుతుందన్నారు. వివిధ హోదాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు హాజరవుతారని వివరించారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు



రామవరప్పాడు: గ్రామంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న నల్లూరివారి కట్ట రోడ్డును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ సాధారణ నిధులు రూ. 24లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. అదే విధంగా గ్రామంలో మిగిలున్న రహదారుల అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. వార్డు సభ్యులు నగుళ్ల కుమారి, మట్టా క్రాంతి సరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ న్యాయ ఉత్సవం

పెనమలూరు: కానూరు వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ లా కాలేజీలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు మూడవ సిద్ధార్థ జాతీయ న్యాయ ఉత్సవం–2024 నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ దివాకర్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే ప్రారంభోత్సవంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కె.మన్మథ రావు పాల్గొంటారన్నారు. 21న లీగల్ క్విజ్ పోటీ, 22న మూట్‌కోర్టు సెమీ ఫైనల్స్, ఫైనల్స్ ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో జాతీయ స్థాయి నుంచి వివిధ కాలేజీల విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్, సిద్ధార్థ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు మలినేని రాజయ్య, పాలడుగు లక్ష్మణరావు, కాలేజీ కన్వీనర్ పర్వతనేని ప్రభాస్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు.

క్రికెట్‌లో వీఆర్ సిద్ధార్థ జట్టు విజయం



పెనమలూరు: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీ క్రికెట్ నాక్ అవుట్ పోటీల్లో కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం సాధించింది. ఫిజికల్ డైరెక్టర్ పోతిని రఘు తెలిపిన వివరాల ప్రకారం.. కాలేజీ గ్రౌండ్‌లో గురువారం జరిగిన పోటీల్లో వీఆర్ సిద్ధార్థ జట్టు 20 ఓవర్లలో 156 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. అనంతరం గుంటూరు విజ్ఞాన్ జట్టు బ్యాటింగ్ చేసి 120 పరుగులకు ఆల్ అవుట్ అయింది. వీఆర్ జట్టులో వెంకట్ ఆరు వికెట్లు తీయగా, సుబ్రహ్మణ్యం 49 పరుగులు చేశాడు. మరో మ్యాచ్‌లో గుంటూరు కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ జట్టు కంచికచర్ల మిక్ ఇంజినీరింగ్ కాలేజీ జట్టుపై 49 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా క్రీడాకారులను కాలేజీ డైరెక్టర్ బావినేని పాండురంగారావు అభినందించారు.

2 నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేట, రాఘవయ్య పార్కు సమీపంలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో జనవరి 2వ తేదీ నుంచి బ్యూటీషియన్, టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని ఎంబీ విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా శిక్షణ విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక బ్యాచ్‌లకు టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీ, పెయింటింగ్‌లలో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణలు ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతాయన్నారు. బ్యూటీషియన్ మూడు నెలలు, టైలరింగ్ నాలుగు నెలల పాటు జరిగే ఈ శిక్షణలకు ఆసక్తి గల వారు ఈ నెల 30వ తేదీ లోగా కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 73821 93413, 94900 98021 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గంగూరులో సెమీ క్రిస్మస్



పెనమలూరు: గంగూరు గ్రామంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రదర్ జేమ్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పాటల ఆరాధన, ఏసు జన్మ వృత్తాంతం గురించి సందేశం ఇచ్చారు. పాపులను రక్షించడానికి పరలోకం వదిలి పశువుల పాకలో ఏసు జన్మించాడన్నారు. భక్తులు సంతోషంతో ఉండటానికి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా భక్తులు నాటక ప్రదర్శన, భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో వేమన రాజేశ్వరరావు, చెన్ను ఇసాక్, పులిరాజు, ఫిలిప్, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలు ప్రారంభం



పెనమలూరు: పోరంకి గ్రామంలో రాష్ట్ర స్థాయి చెడుగుడు పోటీలను గురువారం ప్రారంభించారు. టీడీపీ తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు చెడుగుడు పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. ఈ పోటీలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి జట్లు వచ్చి పాల్గొంటున్నాయి. గెలిచిన జట్లకు ప్రైజ్ మనీ అందజేస్తారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్, వంశీ, కోచ్ కె. డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి



ప్రొద్దుటూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు, డిప్యూటీ తహసీల్దార్

కంకిపాడు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రొద్దుటూరు ఎంపీటీసీ సభ్యుడు బి.సురేష్ కోరారు. ప్రొద్దుటూరు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు స్థానికులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం అర్జీ దాఖలు చేయడంతో అధికారులు హుటాహుటిన అర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవలు సత్వరం అందించేలా ప్రణాళికా బద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

నైనవరంలో రెవెన్యూ సదస్సు

పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామ సర్పంచి బి.సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గ్రామస్తులు పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యూటేషన్, సర్వేకి సంబంధించిన సమస్యలు, సబ్‌డివిజన్ చేయాలని తహసీల్దారు బి.సుగుణకు అర్జీలు అందజేశారు. ఈ సదస్సులో మండల సర్వేయర్ జనార్దన్‌రావు, ఆర్‌ఐ రాజేష్, దేవదాయశాఖ అధికారి సుబ్బారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.



తరిగొప్పలలో మాట్లాడుతున్న తహసీల్దార్ విమలకుమారి

ఉంగుటూరు: గ్రామాల్లోనే భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జె. విమలకుమారి సూచించారు.

తరిగొప్పల, తరిగొప్పల కండ్రికకు సంబంధించి తరిగొప్పల గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు పాసుపుస్తకాల్లో చేర్పులు, మార్పులకు సంబంధించి మూడు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ సూర్యకాంతి, డీటీ కిషోర్‌బాబు, వీఆర్‌వో చైతన్య, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి

కంకిపాడు: పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెంటనే తన పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో గొడవర్రు గ్రామంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రజాసంఘాల నేత తాడంకి నరేష్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను విమర్శించడం, అవమానకరంగా మాట్లాడటం హేయమైన చర్య అన్నారు. అమిత్‌షా దేశ ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వై.జోజి, ప్రజా సంఘాల నేతలు వి.మరియదాసు, బి.బాబూజీ, పి.జోజి, రాజకుమార్, కిరణ్, చంటి, క్రాంతి పాల్గొన్నారు.

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అహంకార పూరితమైన వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను పార్లమెంట్ సభ్యత్వం నుంచి వెంటనే తొలగించాలని దళిత, బహుజన పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య పార్కులో గురువారం డీబీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు దుర్మార్గమన్నారు. అంబేడ్కర్‌ను అవమానించడం అంటే దేశ ప్రజలను కించపరచడమేనని అన్నారు. దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు వేమూరి ఏంజెల్, విజయ్‌కుమార్, విశ్రాంత ఉద్యోగులు కొల్లు విజయ్‌కుమార్, నందం ప్రసాద్, బాపట్ల రవి, కేఎస్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన తెలుపుతున్న నేతలు

బాబోరొస్తున్నారు.. రోడ్డు నిర్మిస్తున్నారు

పెనమలూరు: రాజు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అనే సామెతలా ఉంది బాబోరి పర్యటన. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గంగూరు గ్రామ పర్యటనకు వస్తున్నారు. దీంతో ఒక్కసారిగా గంగూరు ప్రధాన రహదారికి మోక్షం లభించింది. బందరు రోడ్డు నుంచి గ్రామం వరకు ఉన్న దాదాపు రెండు కిలోమీటర్ల రోడ్డును ఆగమేఘాలపై నిర్మిస్తున్నారు. 2014 టీడీపీ పాలనలో ఈ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి రోడ్డు మాత్రం నిర్మించలేదు. ఇప్పుడు చంద్రబాబు పర్యటన పుణ్యమా రోడ్డుకు మోక్షం వచ్చింది.

ప్రైవేటు స్థలంలో రోడ్డు

కాగా సీఎం హెలీప్యాడ్ నుంచి రైతు సేవా కేంద్రానికి వచ్చిన తర్వాత అక్కడి నుంచి వెంకటాద్రి మిల్లుకు చేరుకోవాలంటే నేరుగా రోడ్డు లేదు. దీంతో అధికారులు ఒక ప్రైవేటు వ్యక్తి స్థలం నుంచి నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేస్తున్నారు. ప్రైవేటు స్థలంలో రోడ్డు ఎలా వేస్తారన్న ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం లేదు. చంద్రబాబు పర్యటన వల్ల రైతులకు ఏమి మేలు జరుగుతుందో తెలియదు కాని గ్రామ ప్రజలకు మాత్రం రోడ్డు సమస్య తీరిందని పలువురు అంటున్నారు.



ప్రైవేటు స్థలం నుంచి వేస్తున్న రోడ్డు



నిర్మాణంలో ఉన్న గంగూరు ప్రధాన రహదారి

వ్యక్తి అదృశ్యంపై కేసు

పెనమలూరు: పెనమలూరులో వ్యక్తి అదృశ్యంపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోకా రాజ్‌కుమార్ పెనమలూరులో ఉంటున్నాడు. అతను పెయింటర్‌గా పని చేస్తాడు. అతను కొద్ది కాలం క్రితం శ్రావణిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు. కాగా భార్యభర్తలు రాజ్‌కుమార్, శ్రావణి గొడవలు జరుగుతున్నాయి. అయితే అక్టోబర్ 30వ తేదీ నుంచి రాజ్‌కుమార్ కనిపించకుండా పోయాడు. రాజ్‌కుమార్ భార్య శ్రావణి భర్త కనిపించకపోయినా పట్టించుకోకపోవడంతో అతని సోదరి జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

శ్మశానవాటికలో మృతదేహానికి పోస్టుమార్టం



పెనమలూరు: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని ఖననం చేయడంతో పోలీసులు అతని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల ఐదవ తేదీన ల్యాబ్‌టెక్నీషియన్‌గా పని చేస్తున్న కొక్కిలిగడ్డ కృపాకర్ అనే వ్యక్తి మృతి చెందాడు. అతనికి కుటుంబ సభ్యులు లేకపోవడంతో బంధువులు అతని మృతదేహాన్ని యనమలకుదురుకు తీసుకువచ్చి శ్మశానవాటికలో ఆరవ తేదీన కరణం చేశారు. అయితే అతని మరణం పట్ల మృతుడి బంధువులకు అనుమానం వచ్చి ఈ నెల 14వ తేదీన అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు జిల్లా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు యనమలకుదురు శ్మశానవాటికలో గురువారం పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ భవాని, అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కృష్ణబాబి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కేసు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కమ్మేసిన కారుమబ్బులు.. అన్నదాతల్లో గుబులు



గొడవర్రులో నేల వాలిన వరి పైరు

- అల్పపీడన ప్రభావంతో మోస్తరు జల్లులు
- వర్ష సూచనతో ఆందోళన

కంకిపాడు: అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొంటున్నాయి. దీంతో రైతుల గుండెల్లో గుబులు రేగుతోంది. మోస్తరు వర్షపు జల్లులు పడుతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి, మెట్ట భూముల్లో సాగు చేసిన మినుము పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు.

కంకిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో 16వేల ఎకరాల్లో వరి సాగుకు అనువైన భూమి ఉంది. సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో రైతాంగం ప్రత్యామ్నాయంగా మెట్ట భూముల్లో మినుము పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట తీతకు సిద్ధంగా ఉంది. కొన్ని గ్రామాల్లో మినుము తీత పనులు చేపట్టారు.

అల్పపీడనంతో ఆందోళన

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. కారుమబ్బులు కమ్మేసి గురువారం సాయంత్రం నుంచి మోస్తరు జల్లులు కురుస్తున్నాయి. జల్లులతో కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలు నేలవాలి పోతున్నాయి. ఇప్పటికే వాతావరణం మార్పుల కారణంగా మద్దూరు, గొడవర్రు, ఉప్పలూరు పరిసరాల్లో వరి చేలు నేలవాలాయి. కోతకు ఎకరాకు మిషన్‌పై గంటకు రూ. 3,500 వరకూ డిమాండ్ చేస్తున్నారు. నేలవాలిన వరి చేలకు ఎకరానికి కోతకు రూ. ఏడు వేలకు పైగా ఖర్చులు అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ దశలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతాంగాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. ధాన్యం రాలిపోయి ఎకరాకు ఏడు నుంచి 10 బస్తాల వరకూ నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. అంతేకాకుండా మినుము తీత పొలాల్లో గాలిగూళ్ల మీద ఉన్న పంటకు అల్పపీడనంతో కురిసే వర్షాలతో నష్టం చేకూరుస్తుందని అన్నదాతలు భయపడుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు రైతులను ఆందోళన పరుస్తున్నాయి.

దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం దక్షిణామూర్తికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ అనంతరం పూజలు చేశారు. అనంతరం పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు.



డ్రైవింగ్ స్కూల్ ట్రైనీలకు సర్టిఫికెట్లు ప్రదానం

పటమట(విజయవాడ తూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ (విజయవాడ) మోడల్ డ్రైవింగ్ స్కూల్ (అంపాపురం)లో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న 1,078వ బ్యాచ్ ట్రైనీలకు సర్టిఫికెటలను అందించామని కృష్ణా జిల్లా లారీ యాజమానుల సంఘం అధ్యక్షుడు నాగుమోతు రాజా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విద్యావేత్త చలువాది మల్లికార్జునరావు హాజరై సర్టిఫికెట్లు అందజేశారని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలు నివారించాలంటే వాహన నియంత్రణ అవసరమని చెప్పారు. డ్రైవర్లు తగిన శిక్షణ తీసుకోవాలని సూచించారు. రాజా మాట్లాడుతూ రహదారి భద్రతకు లారీ ఓనర్ల సంఘం కట్టుబడి ఉందని చెప్పారు. ఉత్తమ డ్రైవర్లను సమాజానికి అందించేందుకు రూ.6 వేల నామమాత్ర రుసుముకే 32 రోజులపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నామన్నారు. రక్తదానం చేసిన ట్రైనీలకు కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు ప్రశంసపత్రాలు అందించారన్నారు. కార్యక్రమంలో కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్ల సంఘం ఉపాధ్యక్షుడు కె. సత్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్ బాబు, కోశాధికారి పొట్లూరి చంద్రశేఖరరావు పాల్గొన్నారన్నారు.

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో ఫుట్‌పాత్‌లు, రహదారుల ఆక్రమణలపై ఎట్టకేలకు అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. బాపులపాడు గ్రామ పంచాయతీ, రెవెన్యూ, పోలీస్‌లు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక విజయవాడ రోడ్డు, నూజివీడు రోడ్డులో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి, ఏఎస్ఐ రాజు నేతృత్వంలో ఫుట్‌పాత్, రహదారుల వెంబడి ఆక్రమణను తొలగించారు. ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ బేఖాతరు చేస్తూ ఫుట్‌పాత్, రహదారులను ఆక్రమించి పాదచారులు, ప్రయాణికులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి పూర్ణేశ్వరి చెప్పారు. దీంతో ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకున్నామని పేర్కొన్నారు. ఫుట్‌పాత్‌లు, రహదారులను వ్యాపారులు ఆక్రమించి బోర్డులు, తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు

తేది 19-12-2024